
# ఈ ప్రశ్నకు నీ బదులేది?



## 22

**గనారా**

కరిం బీడికట్ట. స్టార్ అగ్గిపెట్టె విసురుగా పాత మేజాబల్లపై గిరవాటు వేసాడు నాయుడు నాగభూషణం. భుజంపైనుండి జారిపోతున్న టర్కీటవల్ పైకి లాక్కొని, గిరిజాల జుట్టు పక్కకి సర్ది పెద్ద నిట్టూర్పు విడిచి పడకకుర్చీలో వాలిపోయాడు ఈ భాగవతారు.

కూజాలోని చల్లటి నీళ్ళు అల్యూమినియం గ్లాసులో పోసి గురువుగారికి అందించాడు చిడతల వాయిద్యకారుడు ప్రసాదు. టేబుల్‌పై ఫేను ఆన్ చేసి,

"అబ్బ ఆపరా! ఈ సంగీతానికి నీ చిడతల వాయిద్యానికి జోడి సరిపోతుంది"

"జోడి కుదరందల్లా నీకే!"

మనసులో అనుకున్నాడు ప్రసాదు.

నీళ్ళు తాగి తెప్పరిల్లిన నాయుడు పైకి లేచి అటు ఇటు ప్రచారాలు చేసి బల్లపై మాసిన పాతగుడ్డ సర్ది

"చంద్రకాంతం ఏమైపోయిందిరా!... ఇది మూడో రోజు, ఈవేళన్నా వస్తుందా!"

"ఊరు వెళ్ళిందండీ!.... వాళ్ళ అమ్మ కిరాణాకొట్టు దగ్గర కనబడ్డాది. మామయ్య తీసుకొని వెళ్ళారట!"

కాల్చి పారేసిన బీడి ముక్కలు సిగరెట్టు పీకెలు అగ్గిపుల్లలు చెత్త .... అంతా గోడవారుగా ఊడుస్తూ చెప్పాడు ప్రసాదు.

"నాతోపాటే వస్తావు - నాతోపాటే పోతావు పదినిముషాలు ముందు వచ్చి ఊడ్చువచ్చుకద"

గురువు నాగభూషణం చికాకుక్కారణం ప్రసాదుకు ఎరుకె

రెండు నెలలుగా అద్దె చెల్లించటం లేదు, కళాభిరుచి కలిగిన బడిపంతులు అప్పగించిన ఇల్లు! అసలు కళాకారుల రిహార్సల్స్‌కు ఇల్లు అద్దెకు ఎవరు ఇస్తారు? సంసారాలు చేసుకునే చోట, ఇదేమి సంతగోల అనరూ! అయినప్పటికి తన మీద వున్న గౌరవం కొద్దీ ఇల్లు ఇచ్చారు శుభ్రం చేయకపోతె ఎలా?

"ఇల్లు గలాయిన వచ్చారండి అద్దె గురించి మీకు చెప్పమన్నారు.

"ప్రోగ్రాంలు ఎక్కడివిరా? చెప్పలేక పోయావా?

అదే సమయంలో హార్మోనియం మాస్టారు పోస్టుకార్డు పట్టుకొని నీరసంగా లోపలికి వచ్చాడు.

"ఎక్కడ్నుంచి?" - నాయుడు ప్రశ్న.

"అనకాపల్లి నుంచి... మన ప్రోగ్రామ్ కేన్సిల్ చేసి రికార్డింగ్ డాన్స్ పెట్టమని గొడవచేస్తున్నారట! క్షమించమన్నారు అడ్వాన్స్ వాపసు అవసరం లేదట!"

తనకు డేట్స్ లేవని చెపితే నిరుత్సాహంతో వెనుదిరిగిన ప్రేక్షకప్రతినిధులేనా? ఎంత మార్పు! ప్రజల అభిరుచిలో మార్పును గమనిస్తున్న నాయుడు నాగభూషణానికి చికాకు ఇంకా కాస్త పెరిగింది! ఈ రికార్డింగు డాన్సులు. లైట్ మ్యూజిక్ తమ ఉపాధి కిందికి చాప కింత నీరులా చేరుతున్నాయని అర్థమయ్యింది, ముందు ముందు తమ ఉనికినే ప్రశ్నిస్తాయేమో!

ప్రోగ్రాం నిర్వాహకులు యిచ్చే పారితోషకం గీసి గీసి యిస్తారు. చందాలు వసూలు కాలేదని సాకు. అయినా ప్రేక్షకుల చదివింపులు బాగానే వస్తుంటాయి. సంవత్సరం పొడుగునా పాతికో, ముప్పయ్యో ప్రోగ్రాములు. ట్రూపు అంతటికి పార్ట్‌టైం! తనకు జీవనోపాధి పాతిక ముప్పై వేలు కళ్ళజూసేవాడు. అదనంగా స్త్రీ ధనంగా వచ్చిన పొలం నుంచి ఒడ్లు. సంసారం, నల్లేరుపై బాడిలా సాగిపోతూ వుంది. సగటు కళాకారుడి కడుపులో ఆకలి, గుండెలో బాధని బుజ్జగించి, ముఖానికి రంగు పూసుకొని, తిరిగినట్లే; నాయుడు హుందాగానే ఉన్నాడు!

\+ \+ \+

పెళ్ళయిన కొత్త రోజులు తిరుపతి మొక్కుకి తండ్రి తీసుకువెళ్ళాడు; తిరుగు ప్రయాణంలో నొప్పితో మెలితిరిగిపోతున్న తండ్రిని చూసి నాయుడు కంగారు పడిపోయాడు. గార్డు నెల్లూరు స్టేషన్‌లో దిగి వైద్యం చేయించమని దింపేసాడు. పోర్టరు సలహాతో రెండు కిలోమీటర్ల అవతల 'రూపాయి ఆస్పత్రి' ఉందని



పేదలపెన్నిదని చెప్పాడు. ఎలాగో అక్కడ చేరి తండ్రికి వైద్యం చేయించాడు.

రెండు రోజులు ఉండమని డాక్టర్ల సలహా!

పగలు ఆస్పత్రి బయట చెట్టునీడ!

రాత్రి ఆవరణలో సర్దుబాటు. నాయుడుకి కాలక్షేపానికి గేయాలు. పద్యాలు అల్లుకొనేవాడు.

పీసపాటి నర్సింహమూర్తి పౌరోహిత్యం రోజుల్లో ఆయన దగ్గర అక్షరాభ్యాసం. వాచకంలో భావగంభీరత. రాగాలాపనలో హెచ్చుతగ్గులు. హృదయాన్ని ద్రవింపచేయడంలో నేర్పు అలవడ్డాయి!!!

'సాకేత సార్వభౌమా' అని గొంతు ఎత్తుకోవడంతో కావిళ్ళు దించిన రైతుల చెవులు నిక్కపొడిచేవి. ఒక్కటేమిటి షణ్ముక ఆంజనేయులు పద్యాలు ఆకుల నర్సింహం హార్మోనియం 'రాధను రమ్మన్నాడు రాసక్రీడలకు రాధను రమ్మన్నాడు' అని పాడుతుంటే బావి వద్ద ఆడువారు మూతులు తిప్పుకునేవారు.

చిన్నతనంలో డ్రామాలు వేసేవారి ముఖానికి అద్దం చూపేవాడు. నూనూగు మీసాలప్పుడు సాంఘిక నాటకాలకు ప్రాప్టింగ్ యిచ్చేవాడు. నాజరు బుర్రకథ ఎక్కడ వున్నా సైకిలుపై మైళ్ళకొద్దీ పోయేవాడు. ఆయన కథ మధ్యలో అభ్యుదయ గేయాలు నాయుడ్ని ఉత్తేజపరిచేవి.

ఆస్పత్రిలో డాక్టర్ల మీటింగు గదిలోకి తొంగిచూసాడు నాయుడు. తర్ఫీదు కొచ్చిన డాక్టర్స్, నర్సులు, శ్రద్ధగా కూర్చున్నారు.

"మనం ప్రజల గురించి పనిచేయాలి వైద్యం అందక ఎంతోమంది పేదజనం అల్లాడిపోతున్నారు. వైద్యం అందరికి అందుబాటులో లేదు. మూఢ విశ్వాసాలతో నాటు వైద్యానికి బలయిపోతున్నారు. సరైన వైద్యం అందించి వారిని చైతన్యపరచాలి." నాయుడుకి స్పష్టంగానే వినిపించాయి.

"నిజమే! ఈ దారిలో తన తండ్రి పరిస్థితి ఏమిటి?" ఈ ఆలోచనతోటే బయట చెట్ల నీడకు చేరుకున్నాడు. విశాలమైన ఆ తోటలో గుబురుగా పెరిగిన చెట్లు - వైద్యానికి వచ్చిన రెండెడ్ల బళ్ళు, దూరంగా వంటలు చేసుకునేవారి పొయ్యిల నుండి వచ్చే సన్నటి పొగ, జీవితమే క్షతగాత్రమై నెత్తురోడుతూ వున్న, కళ్ళతో ఉన్న జీవశ్చవాలు! పశ్చిమ ఆకాశన గాయపడ్డ సూర్యునికి కట్టుకట్టినట్లు తెల్లటి మేఘం, సన్నగా పోతూవుంది. చివరిసారిగా, దిగవిడుస్తున్న కిరణాలు, చెట్ల కొమ్మల మధ్య పడుతూ వున్నాయి. ఆ వాతావరణంలోనే నలత!

డాక్టర్ గారు తన వైపు రావడం గమనించి నమస్కరించాడు.

నాయుడు భుజంపై చెయ్యివేసి,

"నీ పద్యాలు నిన్నరాత్రి విన్నానయ్యా, ఏం చేస్తుంటావు"

"ఖాళీ సార్!.... నాటకాలు-హరికథలు, బుర్రకథలు ఇష్టం"

"మంచిదే! కళాకారుడువన్నమాట! పద్యాలు బాగానే పాడుతున్నావు. నిన్న రాత్రివేళ విన్నాను"

నాయుడు సిగ్గుపడ్డాడు.

"డాక్టరు కన్న కళాకారుడే ప్రజలకు దగ్గరవాడు. మూఢనమ్మకాలు ఛాందసత్వం పెరిగి పోతున్నాయి. మారుతున్న పరిస్థితుల్లో ఉత్తమ కళలు అంతరించే ప్రమాదం ఉంది. మన సంస్కృతి కాపాడు కోవాలి. లేదా - అరాచక సంస్కృతి అన్నిరంగాలకు పాకుతుంది."

నాయుడుకి ఈ ఉపోద్ఘాతం మందులా పనిచేసింది. దిశానిర్దేశం చేసింది.

\+ \+ \+

పడక కుర్చీలో భావగీతాలు పాడుకుంటూ మనసు కుదుట పరచుకుంటున్న నాయుడు చెవులకు

"చంద్రకాంతం అమ్మ వస్తోంది"

తుళ్ళిపడి చూసాడు.

"ఏంటి తమ్ముడూ రమ్మన్నా!"

రెండు సంవత్సరాలుగా నుదుటున బొట్టు మినహాయింపు కాని, 'చంద్రకాంతం అందం ఏపాటి' నాయుడు మనసు అనుకుంది.

"మా తమ్ముడు తీసుకుపోయాడు. దగ్గరే కదా! భోజనాల వేళకు వచ్చేస్తుంది - సాయంత్రం ప్రోగ్రామట కదా."

"అవును. ప్రాక్టీసు లేకపోతే ఎలా!"

"స్టేజీ మీద మరబొమ్మలా శృతి నొక్కడమే కదా! దానికి డాన్సు యిష్టం. నేర్పించరాదూ!"

నాయుడి భయం నాయుడిది. ప్రోగ్రాంలు తగ్గాయి. చంద్రకాంతాన్ని కళాకారిణిగా తీర్చిదిద్దితే; తన బిగువు సడలిపోయినా, ఆమె దగ్గర గురువుగా కాలక్షేపం చేయవచ్చును. వ్యక్తిగత ప్రతిభ మీద ఆధారపడిన ఈ కళాప్రక్రియ, అంతరించకుండా వుంచడం తన వంతు కర్తవ్యం.

నలభై ఏళ్ళ జీవిత ప్రస్థానంలో సాధించింది లేదు. సంపాదించింది లేదు. సాంప్రదాయక భాగవతారులు నికృష్టుడు, అప్రాచ్యుడు అని శపిస్తుంటే వాళ్ళని గేలి చేసి నవ్వుకునేవాడు. యవ్వనం పొంగులో కథ సందర్భాన్ని బట్టి 'జజ్జనకరజనారే జనకు జనా జనారే!' అని చిందులు వేస్తుంటే ప్రేక్షకుల ఈలలు ఉత్సాహపరిచేవి. వామపక్ష రాజకీయ సభలకు తనో ప్రత్యేక ఆకర్షణ. వారి ఉపన్యాసాలలో ప్రజల సమస్యలని పరిష్కారాన్ని గమనించి కథలో మిళితం చేసేవాడు.

\+ \+ \+

శృతి, లయ తప్పని జీవితాలను పడమటి వైపు నుంచి వచ్చే సాంస్కృతిక గాలులు నలువైపులా లేచి వూపేస్తుంటే - నిబ్బరంగా, నిరాడంబరంగా నిలిచి జీవించడం కళామతల్లికి నీరాజనమే కదా!

పక్కగుమ్మం ముందు గంగిరెద్దుల వాడు సన్నాయి ఊదుతున్నాడు. సన్నటి శీతాకాలపు గాలి స్పర్శ. అరవై ఏళ్ళ నాయుడు మనసుకి తాకింది. మనసు మడతల్లో ఎక్కడో గూడుకట్టిన జ్ఞాపకం. ప్రేక్షకులకు వేయడానికి మడత విప్పుతున్న బరకాలోని మట్టివాసన. సింకి శిథిలావస్థలో వున్న పడకకుర్చీలో పడుకున్న నాయుడి కలలో గతకాలపు తెరలేచి విషాదాన్ని చిమ్మింది.

గుమ్మం ముందుకు వచ్చిన గంగిరెద్దువాడు దీనంగా చెయ్యి చూపాడు.

"అలాగే ఎళ్ళు - అలాగే ఎళ్ళు - మాకే ఎండిపోతుంది."

నాయుడు భార్య చీదరించుకుంది. నాయుడుకి కోపం వుబికింది.

"అతడు బిచ్చగాడు కాదు! నాలాటి కళాకారుడే!"

ఆ కూడెట్టింది! వూడిన మంచంకోడులా మూలన పడివుంటే పలకరించే దిక్కేలేదు."

భార్య నొచ్చుకుంది.

వెలిసిన రంగురంగుల గుడ్డల మధ్య ఎద్దు మూపురంలా, మెల్లగా సన్నాయి చంకన పెట్టి ఎద్దును లాక్కుపోతూ వున్నాడు. సంక్రాంతి ముగ్గుల మధ్య గంగిరెద్దు తిరుగకపోతే, చిన్నబుచ్చుకునే గ్రామాలు - కూడలి మధ్య అవి చేసే విన్యాసాలు చూసి, ఆనందించే చిన్నారులు ఏమైయిపోయారు?

"ఇలారా! ఇక్కడ కూర్చో!.... ఏదీ ఒక్కసారి ఆ నాదం వినిపించు."

గంగిరెద్దు వాడు భయం భయంగా కూర్చున్నాడు. నాయుడు ఆహ్వానంలోని ఆసక్తికి కొండంత ధైర్యం ఇచ్చింది.

నాయుడు భార్య కాసేపు ఆగి, లోపటినుంచి చల్లటి మజ్జిగ స్థానంలో చోటుచేసుకున్న టీ తెచ్చి యిచ్చింది.

ఆ రోజులలో ఆమె వెలిగించిన పొయ్యి ఎప్పుడూ ఆరలేదు. వచ్చిపోయే సాటి కళాకారులు, స్నేహితులు, ప్రోగ్రాం నిర్వాహకులు ఒక్కరేమిటి? ఎందరినో ఆదరించింది, ఈ వృత్తి సంపాదన మీదే కదా!

పెళ్ళిళ్ళు పేరంటాలు, మంచి చెడు, జరిపించింది! - కానీ కాలం మారిపోయింది. కళాకారులు వీధిపాలు అవుతూవున్నారు. పొట్టకూటి కోసం దిగజారిపోతూ వున్నారు. చెమ్మచేరిన కళ్ళు వత్తుకుని, పాత శాలువ ఇచ్చి నమస్కరించింది! సాటి కళాకారులను ఆదరించిన ఆ సంస్కారానికి ఎంతటివారైనా శిరస్సు వంచి నమస్కరిస్తారు.

సన్నాయి ప్రవాహంలో ఎక్కడికో కొట్టుకుపోయిన నాయుడులో దుఃఖం పొంగిపొర్లింది.... రెండు చేతులతో ముఖాన్ని దాచుకున్నాడు.

వర్తమాన సమాజంలో మారుతున్న ఆర్థిక, సాంస్కృతిక దశలో వృత్తి కళాకారులు ఇలా బ్రతకవలసిందేనా! వగ్గు కథ గురవయ్యలు, తప్పిటగుళ్ళు, మందహెచ్చులు, వడపోతలు, గొల్లసుద్దులు, గంగిరెద్దులు ఇవన్నీ ఈనాడు ఎక్కడ? చూచాయగా గమనించినా దానిని విశ్లేషించి చూడగల రాజకీయ అవగాహన నాయుడుకి లేదు. తను ఎంచుకున్న కళాప్రక్రియ ఏమేరకు సమాజాన్ని చైతన్యపరిచింది? ఎంతమంది ప్రభావితులు అయ్యారు కాలప్రవాహంలో గమనించలేదు - క్రియాశీలరహితంగా ఉండిపోయాడు.

విశ్లేషణకు సాహిత్యకారుడు - విమర్శకుడు కాదు. మౌఖిక కళారూపాలు ఆయాకాలాల్లో ఒక స్వప్నంలో ఒక అనుభూతిగా లేదా ఉద్రేకంతో లేచిపడిన కెరటంలా మరుగున పడాల్సిందేనా!

ముగ్గుబుట్టలాటి తలతో వంగిన నడుము. హడావుడిగా వచ్చి

"నాయుడూ - నాయుడు చూడు - చూడు ప్రముఖ సినీనటి చంద్రకళ ఎలియాస్ చంద్రకాంతం తన పరపతి ఉపయోగించి మనిద్దరికి వృద్ధకళాకారుల పెన్షన్ ఏర్పాటు చేసింది నీకు నాకు గురుదక్షణ."

స్పర్శలేని నాయుడు చేతిలోని కాగితం గాలికి రెపరెపలాడి ఎగిరిపోయింది.

*(భాగవతార్ సలాది భాస్కరరావు స్మృతికి)*

